వైదిక సాహిత్యమాల–౬

ఓ౩మ్

శ్రావణీ ఉపాకర్మ

[ఋషితర్పణం]



హిందీమూలం : ప్రొఫెసర్ **ఉమాకాంత్ ఉపాధ్యాయ్** ఎం. ఏ.

అనువాదం : **లోక లక్ష్మీనారాయణ** బి.ఏ. బి.ఇడి.

–: ప్రకాశకులు :–

వైదిక సాహిత్యమాల

ఆర్యసమాజ్, గోషామహల్ - భాగ్యనగరము - ఆం. ప్ర.

ఆర్యసమాజ దశ నియమాలు

1. సమస్త సత్య విద్యలకును విద్యచే నెఱుఁగబడు పదార్థములకును ఆది మూలము పరమేశ్వరుడు.

2. ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వ శక్తిమంతుడు, న్యాయకారి, దయాళువు, అజన్ముడు, అనంతుడు, నిర్వికారుడు, అనాది, అనుపముడు, సర్వాధారుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు సృష్టికర్తయునై ఉన్నాడు. అతనినే ఉపాసించుట తగును.

3. వేదము సమస్త సత్యవిద్యల పుస్తకము, వేదమును చదువుట చదివించుట, వినుట, వినిపించుట ఆర్యులందరి పరమ ధర్మము.

4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును, సర్వదా సంసిద్ధులై ఉండవలయును.

5. అన్ని పనులు ధర్మానుసారముగా అనగా సత్యాసత్యములను ఆలోచించి చేయవలెను.

6. ప్రపంచమునకు ఉపకార మొనర్చుట ఈ సమాజముయొక్క ముఖ్యోద్దేశ్యము. అనగా శారీరిక, ఆత్మిక మరియు సామాజిక ఉన్నతిని బడయుట.

7. అందరితో ప్రేమపూర్వకముగా, ధర్మానుసారముగా, యథాయోగ్యముగా వ్యవహరించవలయును.

8. అవిద్యను నశింపజేసి, విద్యను పెంపొందింప వలయును.

9. ప్రతి యొక్కరు తమ ఉన్నతి యందే సంతుష్టులు గాక, అందరి ఉన్నతిలో తమ ఉన్నతి నెంచవలయును.

10. మనుష్యులందరు సామాజిక–సర్వహితకరములగు నియమములను పాలించుటలో పరతంత్రులుగా నుండవలయును. మరియు వ్యక్తి హితకరములగు నియమములందు అందరు స్వతంత్రులుగా నుండ తగును.

వెల : 40 పైసలు

మా మాట

మనమంతా శాంతి - సౌఖ్యముల నభిలషించేవారము. వాటిని పొందుటకు సత్యజ్ఞానము, సాధన అవసరం. నేటి యుగమందు విద్య-విజ్ఞానము లెంతయో అభివృద్ధి గాంచినవి. వాని సహాయమున సుఖ సాధనములను సమకూర్చుకొనవచ్చు. యేనకేన ప్రకారేణ వాటిని సమకూర్చుకొనుటే జీవితపరమావధియైపోయినది. అందుచేత సమాజంలో నీతి_బాహ్యమైన వ్యవహారము సాగుతూంది. శాంతి కరువై పోయినది. దీనికంతా కారణం _ అజ్ఞానం _ స్వార్థం.

వీటిని పారద్రోలుటకు సత్యజ్ఞానము-పరమార్థము నెరుగవలసిన ఆవశ్యకత ఎంతేని వుంది. ఈ సత్యము నెరిగిన మహర్షి దయానందులు సత్యజ్ఞానమునకు నిలయమైన వేద - విజ్ఞానమును వెదజల్లుటకు కంకణం కట్టుకున్నారు. తదాశయసిద్ధికై ఆర్యసమాజమును స్థాపించారు. మహర్షి అనుయాయు లెందరో చిత్తశుద్ధితో వేదప్రచారము కోసం, దేశసేవకోసం అంకితమై పోయారు. కాని ప్రస్తుత పరిస్థితి వేరు. వేద ప్రచారము సన్నగిల్లుతూంది. అనుదినమూ విద్వాంసులు, ప్రచారకులు కరువై పోతున్నారు. సాహిత్య సృజన అంతకంటే కొరవడుతూ వుంది. ఇట్టి విషమపరిస్థితిని తిలకిస్తూ అభిమానము గల ఆర్యులు నిట్టూర్పు విడుస్తున్నారు. ప్రయోజనం?

అందుచే ఇట్టి తరుణంలో మనమంతా నిరాశా నిస్పృహలతో నిట్టూర్పు విడిచేకన్నా కర్తవ్యోన్ముఖుల మగుట ఎంతేని అవసరం. ఎవరేమిచేయుచున్నారు అని విమర్శించేముందు నేనేమిచేయుచున్నాను? అని ప్రశ్నించికుంటే బాగుంటుంది. చేతనైన నిర్మాణాత్మకమైన కృషి సలిపితే ప్రయోజనకారిగా వుంటుంది.

"వైదిక సాహిత్యమాల":- పై అభిప్రాయముతో జనసామాన్య మందు ధర్మప్రచారార్థము తగు సాహిత్యమునందివ్వాలని తలపెట్టినాము. "వైదిక సాహిత్యమాల" యను శీర్షికన ఇట్టి సాహిత్యమును ప్రచురించ దలిచాము. ఇందు వేదోక్త, వేదసమ్మత అభిప్రాయములను వెలిబుచ్చు మూల రచనలు, అనువాదములు లఘుపుస్తకముల రూపమున ప్రచు రిస్తాము.

ఇంతవరకు "మీ హితము ఇందే నిహితమైయున్నది", "ఆరాధ్యు డెవరు", "ఆర్యసమాజము" మరియు "పూజనిజస్వరూపము" అను నాలుగు ప్రచురణలను మీకు అందించగలిగాము. ఈ పవిత్ర కార్యము కొనసాగుటకు ధర్మాభిమానులంతా తగు సహకారము నందివ్వాలని ప్రార్థించుచున్నాము. రూ॥ 101/- చెల్లించి ధర్మ రక్షక సభ్యులుగాను, రూ॥ 51/- చెల్లించి ధర్మ పోషక సభ్యులుగాను, రూ॥ 25/- చెల్లించి ధర్మ సహాయక సభ్యులుగాను, రూ॥ 11/- చెల్లించి ధర్మమిత్ర సభ్యులు గాను, చేరవలసిందిగా ఆహ్వానించుచున్నాము. ఒక్కొక్క ప్రచురణ భారమంతా ఒకే వ్యక్తి లేదా సంస్థ భరించినట్లయితే, ఆ ప్రచురణ యందు వారి సంపూర్ణ పరిచయము ఇవ్వబడును.

"వైదిక సాహిత్యమాల" సురభిత కుసుమముల నాఘ్రాణింప జేయుటకు మా యీ ప్రణాళిక మీ కందరికి నచ్చుతుందనే విశ్వాసంతో మీ సహాయ సహకారములు తప్పకుండా లభించగలవనే ఆశతో—

భవదీయులు

లోకుల భర్తయ్య గుప్త
సంరక్షకులు

ప్రేమరాజ్ "ప్రేమ్"
ఆర్. రామచంద్రకుమార్
సంపాదకులు

సంపాదకీయము

ఆర్యుల పండుగలలోకెల్ల అతి ప్రధానమైనది శ్రావణీఉపాకర్మ. శ్రావణ పౌర్ణమినాడు దీనిని జరుపుకుంటారు. దీనికి "ఋషితర్పణం" అనే పేరుకూడా ఉంది. ప్రాచీన కాలంలో ఆర్యులు ఈరోజున వేదాధ్యయన వ్రతమును పూని, స్వాధ్యాయము చేయుటకు ఉపక్రమించేవారు. అందుకే ఈ పండుగకు "శ్రావణీఉపాకర్మ" అనే నామకరణం జరిగినట్లున్నది. వేదాలపట్ల ఆర్యులకుగల భక్తిప్రపత్తులను తెలియజేసే పండుగ ఇది.

వేదమహాత్మ్యము :-వేదము ఈశ్వరీయ జ్ఞానము. తమ సుప్రసిద్ధ గ్రంధమగు మహాభాష్యమందు ఒకచోట మహర్షి పతంజలి వేదమహాత్మ్యమును ఇట్లు వివరించారు :-

"ఏకః శబ్దః సమ్యక్ జ్ఞాతం: సుప్రయుక్తః స్వర్గేలోకే కామధుగ్భవతి". అనగా వేదంయొక్క ఏ ఒక్కశబ్దాన్నయినా అన్నివిధాలా అర్థం చేసుకొని, తదనుసారంగా ఆచరిస్తే ఈ ప్రపంచాన్ని స్వర్గంగా మార్చగలిగేశక్తిదానికుంది. మనకు అది కామధేనువు అవుతుంది, అట్టి ఎడ వేదంలోని కొన్ని అంశాలను,కొన్ని అధ్యాయాలను, చివరకుపూర్తి వేదాన్నే అర్థం చేసుకొని. ఆచరిస్తే కలిగే కల్యాణాన్ని మనము ఊహించగలమా?

వేదోద్ధారక మహర్షి దయానంద సరస్వతి అనుగ్రహంవల్లమనకు వేదమహాత్మ్యము బోధపడింది. "వేదము సమస్త సత్యవిద్యల పుస్తకము వేదమును చదువుట, చదివించుట, ఆర్యులందరి పరమధర్మము" అని మనకర్తవ్యాన్ని గుర్తుచేశాడాఋషిపుంగవుడు. ఆయనకు మనమెంతో ఋణపడి ఉన్నాము.

ఆ ఋణాన్ని తీర్చుకోవాలంటే మనం వేదాజ్ఞలను పాటించాలి. వేదప్రచారం గావించి, అన్యులనుకూడా వేదమార్గమునననుసరించునట్లు

చేయాలి. అప్పుడే మానవకళ్యాణము, విశ్వశాంతి సాధ్యమౌతాయి. అన్యథా అవి ఆకాశకుసుమాలుగానే ఉండిపోతాయి.

వేదనిందకుల ప్రాబల్యం పెరుగుతూవున్న ఈరోజుల్లో, వేద ప్రచార బాధ్యతను స్వీకరించిన మహర్షి దయానందుని అనుయాయులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తే, ఆ మహర్షిపట్ల ఘోరమైన కృతఘ్నతే ఔతుంది.

శ్రావణీఉపాకర్మ ప్రతిఏటా మనకర్తవ్యాన్ని గుర్తుచేయుటకు వస్తుంది. ఆరోజు మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. వేదాధ్యయనము చేస్తామనే దీక్షగైకొనాలి. తదనుకూలముగా మనవ్యవహారమూ మారాలి. అప్పుడు మనంచేసే ప్రచారానికి విలువ ఉంటుంది. అది ఫలించి "కృణంతోవిశ్వమార్యం"అనే మనస్వప్నం సాకారమౌతూంది.

కాళయుక్తి సంవత్సర శ్రావణీ ఉపాకర్మ సందర్భమున వైదిక సాహిత్యమాల"యొక్క ఐదవ కుసుమంగా "శ్రావణీఉపాకర్మ" (ఋషి తర్పణం) అనే ఈలఘుపుస్తకాన్ని పాఠకులకు అందజేస్తూ మేమెంతయో సంతసించుచున్నాము. ప్రొఫెసర్ ఉమాకాంత్ ఉపాధ్యాయ ఎం.ఏ.గారు వ్రాసిన ఈ పుస్తకంలో శ్రావణీఉపాకర్మ, ఋషితర్పణం అంటే ఏమిటి? ఏ సాహిత్యము స్వాధ్యాయ యోగ్యము, ఏదికాదు? వేద ప్రచార మునకు అవరోధకులెవరు? మనకర్తవ్యమేమిటి? మొదలగు విషయములు చక్కగా వివరింపబడ్డాయి. ఈ పుస్తక పఠనం ద్వారా పాఠకులు స్వాధ్యాయోన్ముఖులగుటకు ఏకొద్ది ప్రేరణ లభించినా,మా ఈప్రయత్నము ఫలించినట్లుగా భావిస్తాము.

ఈ పుస్తకమును అనువదించిన శ్రీ లోక లక్ష్మీనారాయణగారికి, ప్రచురణ భారము వహించి పుస్తకము వెలువడుటకు కారకులైన డా॥ యం. సంజీవరావు గారికి మా కృతజ్ఞతలు.

శ్రీ కాళయుక్తి శ్రావణీ ఉపాకర్మ
దివి. 18 ఆగస్టు 1978

—సంపాదకులు

ఓం

శ్రావణీ ఉపాకర్మ (ఋషితర్పణం)

వైదిక సాహిత్యంలో జ్ఞానానికి, విద్యకు చాలా గొప్పమహత్త్వ మున్నది.

"నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహదృశ్యతే"

జ్ఞానానికి, విద్యకు సమానమైన పవిత్రవస్తువు మరొకటేదీ లేదు.

"ఋతే జ్ఞానాన్నముక్తిః"

జ్ఞానంలేని నునుష్యుడు ముక్తిని పొందలేడు. కాబట్టి జ్ఞానార్జనకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వబడింది. జ్ఞానాన్ని పొందటంలో, విద్యను ఆర్జించటంలో, ప్రజ్ఞను పెంపొందించుకొనటంలో ప్రమాదం చేసేవారు ఎల్లప్పుడు కష్టాలపాలౌతారు.

"ప్రజ్ఞాపరాధోహిమూలం సర్వరోగాణామ్"

ప్రజ్ఞకు, బుద్ధికి పట్టినదోషమే రోగాలన్నిటికిని మూలకారణం అని ఋషులంటారు.

జనులు ప్రజ్ఞాదోషానికి దూరంగా ఎట్లుండాలి? పవిత్ర జ్ఞానాన్ని ఎట్లుపొందాలి? విద్యార్థులైతే గురువులవద్ద జ్ఞానార్జన చేస్తారు. విద్యను పొందటం వారికి సులభం, కాని గృహస్థులు జ్ఞానార్జనకు ఏమి చేయాలి? వీరికొరకు శ్రావణీఉపాకర్మ అనే స్వాధ్యాయ పండుగ ఏర్పడింది. వీరు

ఈ పండుగ సందర్భంలో స్వాధ్యాయం చేస్తామని దీక్షగైకొనాలి. స్వాధ్యాయ విధానాన్ని తెలిసికొని పట్టుదలతో స్వాధ్యాయం చేస్తూండాలి.

పూర్వకాలంలో విద్యార్థులు విద్యను ముగించుకొని తమ తమ ఇళ్లకు తిరిగివచ్చునపుడు, దీక్షాంత సమయాన, గురువులు వారికి ఇలా ఆదేశిస్తూండేవారు—

"స్వాధ్యాయాన్మా ప్రమదః"

"స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్"

ఓ శిష్యా! నీవు స్వాధ్యాయం చేయటంలో ఏమరుపాటు చేయకు. స్వాధ్యాయం ద్వారా జ్ఞానాన్ని సంపాదించి ప్రవచనం ద్వారా దాన్ని ఇతరుల లాభం కొరకు వారికి అందజేయుము. ఇది గురువుయొక్క ఆజ్ఞ. దీన్ని తిరస్కరించవద్దు.

స్వాధ్యాయ మహత్త్వాన్ని దృష్టియందుంచుకొని ఋషులు శ్రావణీ పూర్ణిమసందర్భంలో శ్రావణీ ఉపాకర్మ (ఋషితర్పణం) అనే పండుగను ఏర్పాటు చేసినారు. ఇది వర్షాకాలంలో వస్తుంది. అప్పుడు విద్వాంసులు ఎక్కువగా భ్రమణం చేయలేరు. వ్యవసాయపు పనులు గూడా అంతగా ఉండవు. సామాన్యంగా సమాజంలోని అన్నివర్గాల జనులు సావకాశంగా ఉండటంవల్ల విద్వాంసులతో సమావేశం సులభమౌతుంది. కావున ఇట్టి సమాయాన ఋషితర్పణమనే పండుగ చేసుకుంటారు.

ఋషితర్పణం ఎట్లాచేయాలి? స్వాధ్యాయం ఎట్లు చేయాలి? అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి. ఋషితర్పణం విషయంలో మనుస్మృతి ఆదేశ మిట్లున్నది—

"స్వాధ్యాయేనార్చయేతర్షీన్" ॥ మను. ౩-౮౧ ॥

స్వాధ్యాయం ద్వారా ఋషులపూజ చేయాలి.

స్వాధ్యాయం రెండు రకాలు :

౧. స్వయంగా గ్రంథపఠనం చేసి అందలి భావాన్ని హృదయంగమం చేసుకొని సమయానుకూలంగా ఆచరణలో పెట్టాలి. ఋషులు రచించిన గ్రంథాల్ని చదువాలి. చదివిన దానిని మననం చేసుకొని హృదయంలో పదిలపరచుకోవాలి. ఆ భావాలకు అనుగుణంగా తాను ఆచరిస్తూ ఇతరులు ఆచరించునట్లు ప్రేరేపించాలి.

సదాచారియు, సద్భావము గలవాడును, సుయోగ్యుడును ఐన విద్వాంసుని ప్రవచనం చేయుటకొరకు ఎన్నుకోవాలి—ఆ విద్వాంసుడు స్వాధ్యాయశీలుడు, వాక్పటుత్వం కలవాడేకాక ధార్మిక ప్రవృత్తికలవాడై ఉండాలి.

ఇటువంటి ప్రవచనాలవల్ల సామాన్యజనానికీ, స్వాధ్యాయప్రియులకు గూడా విశేషంగా లాభం కలుగుతుంది. ఒక గృహస్థు దినమంతా తన వృత్తిపనిలో మునిగిఉంటే, ప్రవచనంచేయు విద్వాంసుడు తాను సంపాదించినట్టి, అనుభవంలోకి తెచ్చుకున్నట్టి జ్ఞానాన్ని శ్రోతలకు అందిస్తాడు. శ్రోతలు ఆ జ్ఞానాన్ని గ్రహించి కృతార్థులౌతారు. కాని ఉపదేశకుడేగాని శ్రోతలేగాని అల్పభావాలు కలిగియుండరాదు; మొక్కుబడి చెల్లించుకొనుచున్నామనే భావంకూడ ఉండగూడదు. ఉపదేశకుని స్థితి పాలుచేపుతున్న తల్లివంటిదై ఉండాలి. శ్రోతలస్థితి ఆకలిబాధతో అలమటిస్తూ తల్లికొరకు వ్యాకులపడు శిశువువంటిదై ఉండాలి.

ఇట్టివక్తయు, శ్రోతలును ఒక్కచోటచేరినచో అక్కడ నిజంగా

అందరికీ కల్యాణాన్నీ, మేలునూ కలుగజేయునట్టి ఒక శ్రుతియజ్ఞం కొనసాగుతుంది.

ఇంతకన్న సుందరమైన ఋషితర్పణం ఇంకొకటి కాగలదా? కాని దీనితోబాటు మరోప్రశ్న వచ్చిపడుతుంది. స్వాధ్యాయం, ప్రవచనం మంచివే; కాని ఎటువంటి గ్రంథాల స్వాధ్యాయం జరుగాలి ? అపరాధ పరిశోధక నవలలనే గాని వ్యర్థాడంబరాలను ప్రోత్సహించే పత్రికలనే గాని చదువుట స్వాధ్యాయం కాజాలదు. అట్లే రాజకీయ చాండాల తంత్రాలతో కూడి, బల్లగుద్దుతూ, గొంతు చించుకొని ఇచ్చే ఉపన్యాసాలు గూడా ప్రవచనాలు కాజాలవు.

స్వాధ్యాయం గాని ప్రవచనం గాని, వేదం లేక ఋషులచే రచింపబడిన గ్రంథాలకు సంబంధించినదై ఉండాలి.

కాని నేటి పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉన్నది. వేదాల పేరు, ఋషుల పేరు కొందరు స్మరిస్తున్ననూ వేదప్రవచనం కాని వేదవ్యాఖ్యానం కాని ఎవరూ చేయటం లేదు. కొన్ని ఆర్యసమాజమందిరాలలో మాత్రం వేదపఠనం, స్వాధ్యాయం, ప్రవచనం గూడా జరుగుతూంది. కాని అన్యుల ధార్మిక అనుష్ఠానాలలో-తెలిసో తెలియకో-వేదాన్ని, వైదికసాహిత్యాన్ని, ఋషుల గ్రంథాలను అవమానపరచే వ్యవహారమే కనిపిస్తుంది.

హిందువులు అర్బుదాలు, ఖర్వాలు విలువచేసే సంపత్తిగల మందిరాలను నిర్మించినారు. వాటియందు పూజారులంటారు. ధర్మభీరులైన జనులు అచటికిపోయి పూజాపురస్కారాలుగూడా చేస్తారు. కాని ఈ స్థలాలన్నింటిలోను వైదిక సాహిత్యానికి అవహేళనే జరుగుతున్నట్లు కనిపిస్తున్నది. మందిరాలలో రాసక్రీడలు, నాటకాలు ఆడబడుతున్నవి.

మంటపాలపై చరిత్రహీనులైనవారి నాటకసమాజాలు నాటకాలాడు తున్నవి. ప్రవచనాలుగూడా జరుగుతున్నవి. కామకళాకేళీరహస్యాలు అర్థంచేయించబడుతున్నవి. రాసలీలలు ఆధ్యాత్మికతత్వంపేర శ్రీమద్భాగవతం మరియు ఇతర పురాణాల కథాకాలక్షేపాలు ఏర్పాటు చేయబడుతున్నవి. ఒకచోట దుర్గాస్తవం, మరొకచోట సత్యనారాయణకథ, మనోహరాలైన దైవస్తోత్ర పాఠాలు, హనుమాన్‌చాలీసా మున్నగువానిపఠనం గూడా జరుగటం కనిపిస్తూంది. శ్రీమద్భగవద్గీత, తులసీరామాయణాదుల కథా కాలక్షేపాలుగూడా ఏర్పాటు చేయబడుతున్నవి. కాని వేద పఠనం చేసేవారుమాత్రం లేనివారితో సమానమే. కొందరు పరంపరానుయాయులైన దాక్షిణాత్యతాపసులు తప్ప వేదపఠనం చేసేవారేలేరు. పౌరాణిక వర్గంమొత్తం వేదాలను ఉపేక్షిస్తుండటమే కనిపిస్తుంది. అటువంటప్పుడు వేదాల స్వాధ్యాయం జరుగుటెట్లు? అల్పసంఖ్యాకులైన కొద్దిమంది ఆర్యసామాజికులు ఎంతకని వేదప్రచారం చేయగలరు? మనుస్మృతి ఏమనుచున్నదో చూడండి :—

యోఽనధీత్యద్విజోవేదమన్యత్ర కురుతేశ్రమమ్।

స జీవన్నేవ శూద్రత్వమాశు గచ్ఛతి సాన్వయః॥మను ౨-౧౬౮॥

ఏబ్రాహ్మణుడైతే వేదాధ్యయనం చేయకుండా ఇతరత్రా పరిశ్రమ చేస్తాడో అతడు పుత్రపౌత్రాదులతోసహా శీఘ్రమే జీవించియుండగనే శూద్రుడైపోతాడు.

ఏధర్మక్షేత్రానికైనా వెళ్ళిచూడండి; సంస్కృత విద్యాకేంద్రమైన విశ్వనాథుని కాశిలోనే చూడండి; సంస్కృత పాఠశాలల్లోనే చూడండి—పది, పదిహేనేసి సంవత్సరాలు తపస్సుచేసినట్లు సంస్కృతాన్ని నిష్ఠతో

నిరంతర అధ్యయనం చేయటంలో మునిగియుండే విద్యార్థులకుగూడా వైదికసాహిత్యం అపరిచితంగానే ఉన్నట్లు మీకు తెలుస్తుంది. 'శాస్త్రి'. 'ఆచార్య' మున్నగు పాఠ్యాంశాలను చదివేవారిస్థితే ఇట్లుంది! ఇపుడు నిజంగా కుమారిలభట్టు కాలంనాటి నిట్టూర్పు మరల ధ్వనిస్తుంది—

"కింకరోమి, క్వగచ్ఛామి. కో వేదానుద్ధరిష్యతి?" ఏమి చేతును? ఎందుబోదును? వేదాలనెవరుద్ధరింతురు?

వేదభక్తులే వేదాల నుద్ధరింతురని దీనికి స్పష్టమైన సమాధానం మేము వేదప్రచారం చేస్తాము. కాని వేదాలకు ఇద్దరు శత్రువులున్నారు. వారిని దృష్టిలో పెట్టుకోకున్న వేదప్రచారం గాని. ఋషితర్పణం గాని కాజాలదు. ఆ యిద్దరిలో—

ఒకరు వేదవిరోధులైనపాశ్చాత్య విద్వాంసులు. వీరు వేదాలను అవమానింతురు, తిరస్కరింతురు. ఉదాహరణకు—

"Prof. Maxmuller did not hesitate to say, it must not be forgotten that though the Historical interest of the Veda can hardly be exaggerated, the large number of Vedic hymns are 'childish in the extreme, tedious and common place. Many of them convey no clear meaning, or are full of vain repititions. It is not the rule but the exception to find in this great collection of liierature any cry of the soul, any glimpse of a spiritual instinct, any grasp of a high revelation."

—The Rigveda and Vedic Religion
by Clayton P. 157 *

"చారిత్రికంగా వేదాల మహత్త్వం ఎంతగొప్పదైనప్పటికినీ ఒక విషయం మరచిపోగూడదని ప్రొఫెసర్ మాక్స్‌ముల్లర్ నిస్సంకోచంగా నుడివినారు. అదే మనవేదాలలోని పెక్కుసూక్తులు మిక్కిలి బాలిశాలు లేదా అత్యంత మూర్ఖతాపూర్ణాలేగాక తుచ్ఛమైన భావాలతో నిండియున్నవి. అందులోని పలుసూక్తులు స్పష్టమైన అర్థం ఇవ్వకపోగా వ్యర్థంగా పునరుక్తం చేయబడినవిగూడా. ఈ సూక్తాలలో ఎక్కడైనా 'ఆత్మ' ఘోషయేగాని ఆధ్యాత్మికజ్యోతియొక్క మెరుపేగాని, ఉన్నతమైన ఈశ్వరీయ జ్ఞానప్రభయేగాని కనుపించినచో అది సర్వసామాన్యంగాక అపవాదు రూపంలోనే అని తెలిసికోవాలి."*

——క్లేటన్ రచించిన "ఋగ్వేద అండ్ వైదిక్ రిలీజియన్". పుట 157

దీనివల్ల వేదాలకు మహత్త్వాన్ని ఇవ్వని మాక్స్‌ముల్లర్‌లాంటి విద్వాంసులు ఎందరో కలరని తెలుస్తుంది. ఇట్టి విద్వాంసుల భావాలనే విశ్వసించి నడచుకొనే విద్వాంసులు మనదేశంలో ఎందరో ఉన్నారు.

ఐరోపా ఖండంలోని విద్వాంసులు వేదాలను గొఱ్ఱెల కాపరుల పాటలనియు, వేదజ్ఞానాన్ని (బాలిశములైన) పిల్లకాయల వ్రాతలనియన సాగినారు. అట్టిసమయంలో వారికి సమకాలీనుడైన స్వామిదయానంద సరస్వతిగారు వారికి సమాధానంగా ఇట్లునుడివినారు:—

"వేదం సమస్తసత్యవిద్యల పుస్తకం. వేదాన్ని చదవటం, చదివించటం, వినటం_వినిపించటం ఆర్యులందరికిని పరమధర్మం"

స్వామిదయానందులు పాశ్చాత్య విద్వాంసులను యథార్థంగా, సుస్పష్టంగా ఇట్లు విమర్శించినారు—

* ఇంకా వివరంగా తెలిసికోగోవారు శ్రీధర్మదేవ్ విద్యామార్తాండ్ గారు వ్రాసిన "వేదోంకా యథార్థ స్వరూప్" అధ్యాయం-౧, ఖండం-౩ చూడండి.

"జర్మన్ దేశంలో సంస్కృతం బాగా ప్రచారంలో ఉన్నదనీ, మాక్సుముల్లర్‌గారు చదివినంత సంస్కృతం మరెవ్వరూ చదువలేదనీ అనేవారి మాటలు బూటకాలు, నామమాత్రాలు, ఏలన

నిరస్త పాదపే దేశే ఏరండోఽపి ద్రుమాయతే॥

వృక్షాలులేని దేశంలో ఆముదంచెట్టే మహావృక్షంగా భావింపబడు తుంది. అట్లే యూరపు దేశంలో సంస్కృత విద్యప్రచారంలో లేనందున జర్మన్ దేశీయులు మరియు మాక్సుముల్లర్ కొద్దిగా సంస్కృతం చదువు కొనుటయే ఆదేశానికి గొప్పదైనది. కాని ఆర్యావర్తంలోని విద్వాంసు లతో పోల్చిచూచినచో వారి సంస్కృతజ్ఞానం లెక్కలోనికేరాదు. మాక్సు ముల్లర్ యొక్క సంస్కృత సాహిత్యాన్ని, వారుచేసిన కొద్దిపాటి వేద వ్యాఖ్యను చూచిన నాకు ఆర్యావర్తంలోని ఆయాపండితులు చేసిన టీకలను చూచిన ఏదోవిధంగా వ్రాసినాడని తెలుస్తున్నది...... ....." (సత్యార్థ ప్రకాశం—ఏకాదశసముల్లాసం)

ఇంకా ఎందరో ఇతర పాశ్చాత్య విద్వాంసుల గురించికూడ స్వామిదయానందులు వ్రాసినారు—

"డా. యం. హాగ్, సి. హెచ్. టానీ, అర్. గ్రిఫిత్ మొదలగు వారు వ్రాసిన వ్రాతలన్నియును పరీక్షించకుండా, వివేచించకుండా నమ్మ దగినవనుటకు వారు ఈశ్వరులా యేమి? డా. యం. హాగ్‌ను అందరి కన్న మిన్నగా భావించి పండిత మహేశ్చంద్ర న్యాయరత్న గారివలెనే మనం ప్రాచీన సత్యగ్రంథాలను విసర్జించుటకు ఆర్యఋషులకన్న, మునులకన్న హాగ్ గొప్పవారా? పండితులవారు చేసినట్లు మీరుగూడా చేయుడు. నా దృష్టిలోమాత్రం వారికి ఏస్థానం కలదో దానియందు ఏలాటి మార్పు రాబోదు."

(మహర్షి స్వామి దయానంద సరస్వతి రచిత భ్రాంతినివారణ నుండి)

మహర్షి దయానంద సరస్వతి ఈ వేదవిరోధులతో ఇట్లు ఎదుర్కొంటూ ఉండినప్పటికీ నేడుగూడ ఈ వేద విరోధుల సాహిత్యమే చదివించబడుతున్నది. దీనిని త్యజించి భారతీయ ప్రాచీన సంప్రదాయాన్నను సరించి అధ్యయనం-అధ్యాపనం జరుగునట్లు ప్రయత్నించాల్సి యున్నది.

ఇక రెండోరకం వేదవిరోధులు ఎట్టివారో చూడండి. వీరు తమను వేదభక్తులని చెప్పుకొంటూనే వేద ప్రచారంలోను వేద అధ్యయనంలోను ఆటంకాలు కలుగజేస్తుంటారు. వీరే

"స్త్రీ శూద్రౌ నాధీయతామ్"

స్త్రీలు, శూద్రులు వేదాలు చదువగూడదని అంటారు. అంతేకాదు.

"స్త్రీశూద్ర ద్విజబంధూనాం త్రయీ న శ్రుతి గోచరా"

స్త్రీలు, శూద్రులు, ద్విజబంధువులు వేదాలను వినగూడదు అంటారు.

స్వామిశంకరాచార్యులు తమ వేదాంత భాష్యంలో శూద్రులకు వేదాధ్యయనాన్నే కాదు వేదాలను వినటాన్ని గూడా నిషేధించారు. శూద్రులు వేదం చదివితే, వించే వారికి అమానుషమైన దండన విధించారు.

"అథాస్య వేదముపశ్రుణ్వతస్త్రపుజతుభ్యాం శ్రోత్రప్రతి పూరణమితి। . . . . పద్యుహవా ఏతత్ శ్మశానం యత్ శూద్రః తస్మాత్ శూద్ర సమీపే నాధేతవ్యం భవతి స కథమశ్రుతమధీయాత భవతి చ వేదోచ్చారణే జిహ్వాచ్ఛేదో ధారణే శరీరభేదః ఇతి।"

భావమేమన - శూద్రుడు వేదం విన్నట్లయితే అతని చెవులను సీసం లేక లక్కతో మూసివేయాలి. శూద్రుడు సంచారం చేయుచున్నట్టి శ్మశానం. అతని సమీపంలో అధ్యయనం చేయగూడదు. అతడు వినినచో అధ్యయనం ఎట్లు చేయగలడు? అతడు వేదమంత్రములను ఉచ్చరించినచో అతని నాలుకను కోసివేయాలి. ధారణ యొనర్చినచో శరీరాన్ని ఛేదించాలి.

రామానుజాచార్యుల అభిప్రాయం గూడా ఈ మాదిరిగనే యున్నది.

"అథహాస్య వేదముపశృణ్వతస్త్రపుజతుభ్యాం శ్రోత్రప్రతిపూరణ ముచ్చారణే జిహ్వాచ్ఛేదో ధారణే శరీరభేదః ఇతి।"

స్వామి శంకరాచార్యులు స్త్రీలు వేదం చదువటాన్ని వ్యతిరేకించారు. బృహదారణ్యకోపనిషత్తులోని

"అథయ ఇచ్ఛేత్ దుహితామే పండితా జాయేత"

(బృహ. ౬-౪-౧౭)

అనుదానికి వారిట్లు భాష్యం చేసినారు.

"దుహితః పాండిత్యం గృహతంత్ర విషయమేవ. వేదేఽనధికారాత్।"

కన్యలకు వేదంలో అధికారం లేనందున వారి పాండిత్యం ఇంటి పనుల మట్టుకే పరిమితం.

ఇట్టి వ్రాతల ఫలితంగా వేదాలను చదువటం చదివించటం క్రమక్రమంగా నశించి అనార్ష గ్రంథాలను చదువటం ప్రచారంలోకి వచ్చినది.

వేదాలపై శ్రద్ధ తొలగిపోసాగినది. బ్రహ్మవైవర్త పురాణంలోని ఈ క్రింది మాటలు ఉదాహరణగా తీసికొనవచ్చును.

"సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముత్తమమ్।
పురాణోపపురాణాం వేదానాం భ్రిమభంజనమ్॥"

బ్రహ్మవైవర్తం పురాణాలన్నింటిలో ఉత్తమమైనది. ఇది పురాణాల, వేదాల భ్రాంతిని తొలగించునట్టిది-అని దీని భావం.

స్వామిదయానందులు ఈ వేదవ్యతిరేకతను ఎదిరించి వేదం చదివే అధికారం మానవమాత్రులందరికీ కలదని వేదమంత్రాల ప్రమాణంతోనే నిరూపించినారు.

"యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయచార్యాయ చస్వాయ చారణాయ॥
యజు. ౨౬-౨॥"

ఈమంత్ర ప్రమాణంవల్ల వేదజ్ఞానం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రుల-అనగా మానవమాత్రుల కల్యాణంకొరకే అని ఋజువౌతున్నది.

స్వామి దయానందులవారి ఉదారమైన ఈ భావాలచేత ప్రభావితుడై ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విద్వాంసుడు రోమాఁరోలాఁ స్వామీజీ సాధించిన ఘనకార్యంయొక్క మహత్త్వాన్ని దిగువ మాటలలో వ్యక్తంచేసినాడు.

"It was in the truth, an epoch making date for India when a Brahman not only acknowledged that all human beings have the right to know the Vedas, whose study have been previously prohibited by Orthodox Brahmans but insisted that their Study and propaganda was the duty of every Arya".

భావం – భారతదేశానికిది నిజంగా నవనిర్మాణయుగం. ఏలన ఒక బ్రాహ్మణుడు (స్వామిదయానంద సరస్వతి) మనుష్యమాత్రులకు వేదాధికారం కలదని విశ్వసించెను. అంతేకాదు, ఇట్టి విశ్వాసాన్ని సంప్రదాయకులైన పౌరాణిక బ్రాహ్మణులు పూర్వం నిషేధించియున్న ప్పటికిని వేదాన్ని చదువటం, చదివించటం, ప్రచారం చేయటం ప్రతి ఆర్యునికి పరమధర్మం అని చాటిచెప్పినాడు.

శ్రావణి అనేది స్వాధ్యాయ పండుగ, విశేషించి వేదం మరియు ఆర్షగ్రంథాలను స్వాధ్యాయం చేసేపర్వం. ఇది ఋషితర్పణపర్వం. ఇట్టి పవిత్రమైన పండుగ సందర్భంలో తాను స్వాధ్యాయాన్ని నిరంతరం వృద్ధిచేసికొంటూ ఇతరులను స్వాధ్యాయం చేయటానికై ప్రేరేపించాలి. గురువులు, ఆచార్యులు, విద్వాంసులు మున్నగువారిని ఈ సందర్భంలో ప్రత్యేకంగా సన్మానించడం అవశ్యకర్తవ్యం.

ఓ౩మ్ శమ్

వేదసూక్తులు

* "కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః"-యజు ౪౦/౨
కష్టపడి పనిచేస్తూ వంద సంవత్సరాలు జీవించాలి.

* "మిత్రస్యచక్షుషా సర్వాణి భూతాని సమీక్షే"-యజు ౩౬/౧౮
అందరితో స్నేహ పూర్వకంగా మెలగాలి.

* "అవిద్వేషం కృణోమి వః"-అథర్వణ ౩/౩౦/౧
ఎవరినీ ద్వేషింపకుము.

డా॥ మీనపల్లి సంజీవరావుగారి పరిచయము

జననము : క్రీ. శ. 1936_శ్రీరామనవమి

జననీజనకులు : శ్రీమతి లక్ష్మీబాయి–దేవయ్యగార్లు

సతీమణి : శ్రీమతి డా॥ వసుమిత్రగారు

సంతానము : పుత్రరత్నము-రవి

కుమార్తెలు : కుమారి ఇందిర, అదితి, సునీత.
సవిత మరియు సుధా.

వృత్తి : వైద్యము.


జీవితవిశేషములు : డా॥ యం. సంజీవరావుగారు ఉత్సాహవంతులైన ఆర్యయువకులు. ఒక పేద కుటుంబమున జన్మించి, స్వయం కృషితో పైకి వచ్చినారు. హైదరాబాదు రాజ్యమున, నిజాం పరిపాలనలో పండిత రామచంద్ర దెహల్వీ మరియు పండిత బుద్ధదేవ విద్యాలంకార్ వంటి ఆర్యవిద్వాంసుల ఉపన్యాసములను విని, ప్రేరణనొంది ఆర్యసమాజంలో చేరారు. భారతీయ ఆర్యకుమార్ పరిషద్ నిర్వహించిన "సిద్ధాంత శాస్త్రి" పరీక్షలో పాల్గొని ఉత్తీర్ణులయ్యారు. వీరికి వైదికధర్మము, ఆర్య సమాజముపట్ల అనురాగము మెండు. వీరి గృహమందు తరచుగా వేదోక్త యజ్ఞ_సంస్కారములు, విద్వజ్జనుల సత్కారములు జరుగుతూ వుంటాయి. గత 25 ఏండ్లుగా ఆర్యసమాజమునందుండి స్వేచ్ఛతో సేవ జేయుచున్నారు. తరచుగా వైదికసాహిత్యాన్ని ప్రచురింపజేసి, పలువురికి పంచిపెడుతూ, మౌనంగా ప్రచారం గావిస్తూవుంటారు. ప్రస్తుతము చంద్రికాపురం ఆర్యసమాజానికి కార్యదర్శిగా పనిజేయుచున్నారు.

వృత్తిరీత్యా డా॥ సంజీవరావుగారు వైద్యులు. వారి సతీమణి డా॥ వసుమిత్రగారు కూడ వైద్యులే. ఈ దంపతులిరువురు పేదప్రజలకు ఎంతో సహృదయతతోను, ఔదార్యంతోను వైద్యసహాయము నందించి, వారికి ప్రీతిపాత్రులయ్యారు.

ఇట్టి వీరి ద్రవ్యసహాయంతో ఈ పుస్తకము వెలువడింది. భగవంతుడు వారికీ, వారి కుటుంబమునకు ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించుగాక.

—సంపాదకులు

ద్రవ్య సహాయకులు



డా॥ మీనపల్లి సంజీవరావుగారు

సిద్ధాంతశాస్త్రి

డా॥ వసుమిత్ర క్లినిక్
ఆరోగ్య కేంద్రము
శిబ్లీ గంజ్
హైదరాబాద్–ఆం. ప్ర.

శ్రీ కాళయుక్తి శ్రావణీ ఉపాకర్మ
దివి. 18 ఆగష్టు 1978

Manasa Printers, Opp. Urdu Hall, Himayatnagar, Hyd.